

రాయచోటిలోని వీరభద్రాలయంలో భద్రకాళీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో హరిద్ర అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో గుర్రంకొండ మండలం చెర్లోపల్లె శ్రీరెడ్డెమ్మతల్లి

దేవి శరన్నవరాత్రులు ప్రారంభం

దసరా పండగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా తొలిరోజైన గురువారం దేవి శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలను విద్యుత్తు దీపాలు, పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలోని అమ్మవారు భద్రకాళీదేవిగా, మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారు హరిద్ర అలంకారంలో, గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో శ్రీరెడ్డెమ్మతల్లి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

- న్యూస్‌టుడే, రాయచోటి, మదనపల్లె అర్బన్, గుర్రంకొండ

సమస్యల కూత... వినిపించడం మీ బాధ్యత!

నేడు ఎంపీలతో రైల్వే జోనల్ మేనేజర్ సమావేశం

కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి. చాలా ఏళ్లుగా పనులు నిలిచిపోయాయి. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు ఉపయుక్తమైన ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- కొత్త పల్లవి ఎత్తుకుంటూ ఇటీవల కేంద్ర రైల్వేశాఖ మంత్రికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విజ్ఞప్తి

కడప పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రైల్వే పరంగా పలు సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులు పూర్తిచేయాలి. ముఖ్యంగా వైఎస్‌ఆర్ జిల్లా ముద్దనూరు నుంచి అనంతపురం జిల్లా ముదిగుబ్బ వరకు రైల్వేలైను నిర్మాణం ద్వారా బెంగళూరు మార్గంలోకి కలిపేవిధంగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలి.

- ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆరుణ్‌కుమార్ జైన్‌ను కలిసిన కడప ఎంపీ అవినాష్‌రెడ్డి

కడప- బెంగళూరు రైల్వేలైన్‌పై ఏకాభిప్రాయం లేకుండా వైకాపాకు చెందిన ఇద్దరు ఎంపీలు వేర్వేరుగా ప్రతిపాదనలు అందించారు.

- ఈనాడు, కడప



ముళ్లకంపలతో పెండ్లిమర్రి వద్ద రైల్వేలైను

అన్నమయ్య, వైఎస్‌ఆర్ జిల్లాల్లో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో పడకేశాయి. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్మాణంలో ఉన్న, సర్వే చేపట్టిన ప్రాజెక్టులేవీ ముందుకు సాగలేదు. ప్రధానంగా కడప- బెంగళూరు రైల్వే ప్రాజెక్టును ముందుకుసాగలేదు. గత సర్కారులో పార్లమెంటు వేదికగా రైల్వే ప్రాజెక్టులపై వైకాపా ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ మీరే మీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఒప్పందం మేరకు వాటా నిధులివ్వడానికి ముందుకొస్తేనే ప్రాజెక్టు పూర్తవుతుందని తేల్చి చెప్పారు. వైకాపా ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన రైలు మార్గానికి కేంద్రం ఆమోదం తెలపలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను గట్టెక్కించడానికి, సర్వే చేపట్టిన పనులను పూర్తిచేయడానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

● ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను కలిపే కడప-బెంగళూరు రైల్వేప్రాజెక్టు పట్టాలెక్కించాల్సి ఉంది. ఎంపీలు బాధ్యత తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. విజయవాడలో శుక్రవారం ఎంపీలతో రైల్వే జీఎం సమావేశం కీలకం కానుంది. కడప- బెంగళూరు కొత్తలైను ఏర్పాటుకు 2008-09లో కేంద్రం ఆమోదం తెలిపింది. 2010, సెప్టెంబరు 1న శంకుస్థాపన జరిగింది. ఎనిమిదేళ్లలో పూర్తిచేస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు. ఇప్పటివరకు కేవలం రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8 కిలోమీటర్ల రైల్వేలైను నిర్మాణం మాత్రమే పూర్తయింది. రాష్ట్రంలోనే 83.5 శాతం పనులు చేయాల్సి ఉంది. రైల్వేలైను మొత్తం పొడవు 268 కిలోమీటర్లు కాగా, ఇందులో 217.60 కిలోమీటర్లు రాష్ట్రంలోని గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోకి రాగా, మిగిలిన 50.4 కిలోమీటర్లు బెంగళూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వెళ్తుంది. ప్రాజెక్టును నాలుగు దశల్లో పూర్తిచేయడానికి ప్రణాళిక తయారు చేశారు. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండో దశలో పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా వాల్మీకిపురం వరకు, మూడో దశలో వాల్మీకిపురం నుంచి కర్ణాటక రాష్ట్రం మదగట్ట, చివరి దశలో ముళబాగల్ మీదుగా కోలార్- బంగారుపేట రైల్వేలైనులోకి కలుస్తుంది.



తగ్గనున్న 226 కిలోమీటర్లు

విద్య, ఉపాధి, వ్యాపార, ఇతర పనుల నిమిత్తం చాలామంది బెంగళూరుకు వెళ్తుంటారు. రెండు జిల్లాల వాసులు రైలుమార్గంలో బెంగళూరుకు వెళ్లాలంటే రేణిగుంట మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కడప-బెంగుళూరు రైల్వేప్రాజెక్టు పూర్తయిన పక్షంలో 226 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఉత్తర భారతదేశం నుంచి బెంగళూరుకు త్వరగా వెళ్లడానికి వీలవుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా భారం కూడా తగ్గుతుంది.

కీలకమైన రైల్వేలైన్లను ప్రస్తావించాల్సిన తరుణమిదే

ఒప్పందం చేసుకుని... చేతులెత్తేసి...

ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులు చెల్లించేవిధంగా ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడ్డాక వాటా నిధులు చెల్లించలేమనే అభిప్రాయానికొచ్చింది. భూసేకరణకు మాత్రమే వాటా చెల్లించేందుకు అనుమతించాలని విన్నవించింది. ఇందుకు కేంద్రం అంగీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులిస్తేనే పనులు వేగవంతమవుతాయని కేంద్రం చెబుతోంది. కేంద్రం వార్షిక బడ్జెట్లలో నామమాత్రంగా నిధులు విదుల్చుతోంది. రైల్వేలైను నిర్మాణం ఆలస్యం జరుగుతున్న కొద్దీ వ్యయం కూడా పెరుగుతోంది. శంకుస్థాపన సమయంలో రూ.2 వేల కోట్లతో పూర్తిచేసేందుకు అంచనాలు రూపొందించగా, ప్రస్తుతం నిర్మాణవ్యయం రూ.3,037 కోట్లకు పెరిగింది.

వైకాపా ప్రతిపాదనకు కలగని మోక్షం

2008లో రైల్వేశాఖ ఆమోదం మేరకు కడప నుంచి పెండ్లిమర్రి, ఇడుపులపాయ, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె, రాయచోటి, వాల్మీకిపురం, మదనపల్లె, కర్ణాటక రాష్ట్రం మదగట్ట, ముళబాగల్ మీదుగా కోలార్- బంగారుపేట రైల్వేలైనులో కలుస్తుంది. ఒప్పందం ప్రకారమైతే రాష్ట్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. రాష్ట్ర సర్కారు వాటా భారాన్ని మోయలేక కొత్త ప్రతిపాదనను రైల్వేబోర్డు ముందుంచింది. కడప నుంచి కోలార్-బంగారుపేట లైనులో కలిపే ప్రాజెక్టును పక్కన పెట్టే ప్రయత్నం చేసింది. వైఎస్‌ఆర్ జిల్లా ముద్దనూరు నుంచి అనంతపురం జిల్లా ముదిగుబ్బ వరకు రైల్వేలైను నిర్మాణం ద్వారా బెంగళూరు మార్గంలోకి కలిపేయచ్చని ప్రతిపాదించింది. మొత్తం 72 కిలోమీటర్ల లైనుతో సరిపెట్టేయచ్చునని భావించినా కేంద్రం ఆమోదం తెలపలేదు.

మరికొన్ని ప్రాజెక్టులు

గిద్దలూరు-భాకరాపేట, ఓబులవారిపల్లె- రాయచోటి, కదిరి మీదుగా కడప- హిందూపురం రైల్వే లైన్లకు మోక్షం కలగాల్సి ఉంది. కడప మీదుగా తిరుపతి-సికింద్రాబాద్ మార్గంలో వందే భారత్ రైలు ప్రవేశపెట్టడం, ఎర్రగుంట్ల రైలునిలయాన్ని అమృత్ స్టేషన్‌గా గుర్తించడం, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముద్దనూరు, కొండాపురం రైలునిలయాల్లో నిలపడం, కడప రైలునిలయంలో లిఫ్ట్, ఎస్కలేటర్ ఏర్పాటు చేయడం, నందలూరు రైలునిలయంగా అభివృద్ధి చేయడం.

రూ.40 లక్షల విలువైన 252 చరవాణుల స్వాధీనం

- చోరీకి గురైనవాటిని ఎల్‌ఎంటీఎస్ ద్వారా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.40 లక్షల విలువైన 252 చరవాణులను ఎల్‌ఎంటీఎస్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో రూ.1.96 కోట్ల విలువైన 1,026 చరవాణులను స్వాధీనం చేసుకుని యజమానులకు అందజేశామన్నారు. చరవాణి పోగొట్టుకున్నవారు జిల్లా పోలీసు ఎల్‌ఎంటీఎస్ నంబరు 8688830012కు సంక్షిప్త సమాచారం ఇచ్చిన వెంటనే గూగుల్ లింక్‌ను రిసీవ్ చేసుకుంటారని, ఆ లింక్‌ను తెరిచి మొబైల్ ఐఎంఈఐ నంబరు తదితర వివరాలు నమోదు చేయడం, రసీదు, బాక్స్ అప్‌లోడ్ చేయడం ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే సులభంగా ఫిర్యాదును స్వీకరిస్తామని ఎస్పీ వివరించారు. 2023, సెప్టెంబరు నుంచి 2024, సెప్టెంబరు వరకు 252 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన స్పెషల్ బ్రాంచి సీఐ సత్య నారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మంజునాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు నరసింహనాయక్, రవిశేఖర్, కానిస్టేబుళ్లు అబ్దుల్ సాహుల్, రాధ, ఫామిన్, ఇలియాస్, దేవేంద్రలను ఎస్పీ అభినందించారు. జిల్లాలో దసరా ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.



యజమానికి చరవాణిని అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యం : మంత్రి మండిపల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో గురువారం ఆయన నూతనంగా వచ్చిన తొమ్మిది కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. రాష్ట్రంలో 110 రోజుల పాలనలో సరాసరి రోజుకు రెండు చొప్పున కొత్త బస్సులు ప్రారంభించామన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందని, ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. రాయచోటి-విజయవాడ, మదనపల్లె-విజయవాడకు సూపర్ లగ్జరీ, రాయ చోటి-తిరుమలకు రెండు సప్తగిరి బస్సులు, తిరుపతికి మూడు లగ్జరీ బస్సులు, వేంపల్లెకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు అందుబాటులోకి వచ్చాయని మంత్రి వివరించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం రాము, అధికారులు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


గృహనిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ గృహనిర్మాణాల్లో లక్ష్యాలు పూర్తిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి గృహనిర్మాణంలో పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై సారించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 78,221 ఇళ్లకు 44 శాతం పూర్తయ్యాయని, మిగతావాటిపై దృష్టి సారించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో లబ్ధిదారుల గుర్తింపు 65 శాతం పూర్తయిందని, మిగతాది వెంటనే పూర్తిచేయాలన్నారు. సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారులు ఎప్పటి కప్పుడు సమీక్షించి పురోగతి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి శివయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ మద్దిలేటి, రహదారులు, భవనాలశాఖ ఈఈ సహదేవ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యమ్మ తల్లి ఆలయాభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, గండబోయనపల్లె (వాల్మీకిపురం), న్యూస్‌టుడే: సత్యమ్మ తల్లి ఆలయాభివృద్ధికి ధర్మకర్త, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు చేసే ప్రతి పనికి తాము సహకారం అందిస్తామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెలో వెలసిన శ్రీసత్యమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మొదటి రోజు బాలా త్రిపుర సుందరి అవతారంలోని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఉత్సవాల్లో పాల్గొన్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి ఆలయ ధర్మకర్త పులి సత్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు డప్పు, పిల్లనగ్రోవి వాయిద్యాలు, వేద పండితుల మంత్రాలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలికిరి మాజీ సర్పంచి నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచులు గుర్రప్ప, మహితశేషాద్రి రెడ్డి, ఎంపీడీవో మనోహరరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీసత్యమ్మ తల్లి ఆలయ కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేట పురపాలక కార్యాలయం ఎదుట ఎంపీ మిథున్‌రెడ్డి గోబ్యాక్ అంటూ తెదేపా నాయకులు నినాదాలు చేశారు. పురపాలక కౌన్సిల్ సమావేశానికి గురువారం ఎంపీ వస్తున్నారనే సమాచారంతో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యానాయుడు, నాయకులు పురపాలక కార్యాలయం వద్దకు చేరుకుని మిథున్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజంపేట నాశనం కావడానికి ఎంపీ మిథున్‌రెడ్డి కారణమని ఆరోపించారు. పోలీసులు వారిని అక్కడి నుంచి ప్రధాన రహదారిపైకి పంపించారు. ఇదే సమయంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకున్నారు. పురపాలక సమావేశం ముగియడం, ఎమ్మెల్యే, ఎంపీ సమావేశానికి రాకపోవడంతో ఎంపీ మిథున్‌రెడ్డి పురపాలక కార్యాలయానికి రాకపోవడంతో సమస్య సద్దుమణిగింది.



పోలీసులతో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

రాజంపేట, న్యూస్‌టుడే : స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య కోరారు. ఐఎంఏ హాల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల వారికి గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతి స్కానింగ్‌కేంద్రంలో ఐఈసీ ఫ్లెక్సీలు బాగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉష్శశ్రీ, ప్రోగ్రాం అధికారి దేవశిరోమణి తదితరులు ప్రసంగించారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి : డీపీవో

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని డీపీవో ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం గ్రామీణ మండలం చీకలబైలు పంచాయతీ సర్పంచి ప్రభాకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు పెట్టాలని, బడ్జెట్లు పెట్టి గ్రామాల్లో ప్రాధాన్యత ఉన్న పనులు చేపట్టాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించి ప్రతిపాదించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డుదారులకు పనులు కేటాయించాలన్నారు. ఆర్థిక వనరులపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నీటి యాజమాన్య సంఘం అధికారులు, సచివాలయ అధికారులు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి, పక్కన అధికారులు, ప్రజాప్రతినిధులు

నల్ల పట్టీలతో తపాలాశాఖ సిబ్బంది నిరసన

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని తపాలాశాఖ సిబ్బంది గురువారం పీటీఎం తపాలా కార్యాలయం ఎదుట నల్లపట్టీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాలుగు గంటల పని సమయం అంటూ పది గంటల పని చేయిస్తున్నారన్నారు. పనిఒత్తిడి ఎక్కువగా ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు తపాలాశాఖ కార్యాలయాల్లో ప్రజల నుంచి డిపాజిట్లు ఇతర పథకాల నమోదుకు లక్ష్యాలను విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల వేధింపులతో ఒత్తిడికి గురవుతున్నామని, పని ఒత్తిడి నుంచి తమను ఉపశమనం కల్పించాలని నల్ల పట్టీలతో నిరసన ప్రదర్శన చేపట్టామని తెలిపారు.



తపాలాశాఖ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న పోస్టు మాస్టర్లు

విశాఖపట్నానికి 16 టన్నుల టమాట

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖపట్నం రైతుబజారుకు గురువారం 16 టన్నుల టమాటాలను పంపినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. మార్కెటింగ్‌శాఖ ఆర్‌జేడీ రామాంజనేయులు ఆదేశాల మేరకు మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.75తో కొనుగోలు చేసి, ఆర్‌జేడీ సూచనల మేరకు విశాఖ రైతుబజారుకు తరలించామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు 100 టన్నులకు మించి సరకు రావడంలేదని, బయట ప్రాంతాల్లో టమాట పంట సాగు లేకపోవడంతో పాటు నాణ్యమైన సరకు తగ్గిందని, దీంతో ఇక్కడి మార్కెట్లో ధరలు పెరిగినట్లు చెప్పారు. బయటి మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో పాటు ధరల్లో మార్పులు చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు.

పొలం బాటలో శాస్త్రవేత్తలు... అన్నదాతకు అండదండలు

రైతుకు వెన్నుదన్నుగా పొలం పిలుస్తోంది

వారానికి రెండు రోజులు క్షేత్రస్థాయిలోనే...

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: మూస పద్ధతుల్లో సాగుకు స్వస్తి పలికి నూతన విధానంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న శాఖల సేవలను సద్వినియోగం చేసుకునేలా అందరి భాగస్వామ్యంతో వ్యవసాయశాఖ ముందుకు సాగుతోంది. పెట్టుబడులు తగ్గించి పంటల దిగుబడి పెంచి ఆదాయాన్ని గడించడమే ధ్యేయంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ, దాని అనుబంధశాఖల అధికారులు పొలంబాట పట్టారు. జిల్లావ్యాప్తంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మొదలయ్యాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 65,386 హెక్టార్లు కాగా ఈసారి 30,818 హెక్టార్లలో సాగైంది.



పీలేరు మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో..)	సాగైంది
వరి	10,057	9,769
వేరుసెనగ	42,852	16,139
కంది	2,971	822
చెరకు	66	31

పొలం వద్దే అవగాహన సదస్సులు

వాతావరణం అనుకూలించకపోవడంతో జిల్లావ్యాప్తంగా పంటల సాగుకు వాతావరణం అనుకూలించకపోవడంతో అంతంత మాత్రమే సాగు నమోదైంది. ప్రధాన పంటల్లో వరి సాగు పర్వాలేదనిపించినా మిగతా వర్షాధార పంటలు సాధారణ విస్తీర్ణానికి సగానికి పైగా పడిపోయింది. ఈ క్రమంలో సాగైన విస్తీర్ణంలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, సేంద్రియ, మార్కెటింగ్ అధికారులు పొలంబాట పట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరంతా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను నేరుగా కలిసి సాగులో ఎదురయ్యే కష్టాలు, నష్టాలు తెలుసుకోవడమే కాకుండా దిగుబడి పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వ మార్గదర్శకాలు వెలువడ్డాయి. రోజుకు రెండు గ్రామాల్లో శాస్త్రవేత్తలు, అధికారులు పొలంబాట పట్టనున్నారు. నేరుగా పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడనున్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి.

లోపాలను గుర్తించి లాభాలబాట పట్టించి

సాగులో ఉన్న పంటలను పరిశీలించి చీడపీడలను సకాలంలో గుర్తించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు విశ్లేషించి వెంటనే తగు చర్యలు చేపట్టనున్నారు. సూక్ష్మ పోషకాల లోపాల్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు ఇవ్వనున్నారు. తుంపర, బిందు సేద్యం విధానంలో పంటల సాగు ప్రోత్సహించడం, కౌలు రైతులుంటే గుర్తింపు కార్డులు జారీ చేయడం, రైతు మిత్ర సంఘాలుగా ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా పంట పెట్టుబడులకు రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయనిక ఎరువులు వాడకం తగ్గించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయనున్నారు.

కర్షకులకు ఉపయుక్తం

రైతులకు ఉపయుక్తమయ్యేలా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం. పట్టుబడులు తగ్గించి దిగుబడులు ఆదాయం పెంచేందుకు తోడ్పాటు అందిస్తాం. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అన్నదాతకు చేరువ చేస్తాం. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పొలం బాట పట్టడంతో సాగు మెరుగులు, రాబోయే రోజుల్లో చూడబోతున్నాం. - **చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి**

పాడి రైతుల సంక్షేమానికి చర్యలు: మంత్రి

చిన్నమండెం, న్యూస్‌టుడే : పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు పలు పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పాడి రైతులకు మినీ గోకులాల నిర్మాణానికి దరఖాస్తులు తీసుకున్నట్లు వివరించారు. గ్రామీణ యువత, నిరుద్యోగులకు రాయితీపై రుణాలు అందించి ఎక్కువ మంది పాడి పెంపకం వైపు దృష్టి పెట్టేలా చూడాలని పశువైద్యాధికారులను కోరారు. అంతకు ముందు ఒంగోలు ఆవుకు మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించి మండల స్థాయిలో పరిశీలించారు. అనంతరం లేగదూడల్లో ఆరోగ్యకరంగా ఉన్న మొదటి మూడు దూడల పెంపకందారులకు మంత్రి బహుమతులు అందజేశారు. శిబిరంలో మొత్తం 205 పశువులకు చికిత్సలు, 41 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ జి.రమేష్, పశు వైద్య అధికారులు మాలకొండయ్య, శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్, మాధవి, అమరనాథ్, లోకేష్, గణేష్, రవికుమార్, శివరామిరెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలు జాతి ఆవుకు పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి

తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విని తక్షణం పరిష్కారం అయ్యేలా అధికారులను ఆదేశించారు.

పీకేఎం వీసీగా జేసీకి బాధ్యతలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం) వైస్ ఛైర్మన్‌గా జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు పూర్తి అదనపు బాధ్యతలను కేటాయించారు. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ(చుడా) వైస్ ఛైర్మన్‌గా జేసీ విద్యాధరికి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పరికరాల దగ్ధం

కలకడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం కలకడలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉన్న నస్రీన్ బాను ఇంట్లో గురువారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఇంటిలో టీవీ, ఫ్రిడ్జి, మంచం, పాత్రలు, బీరువాలు, కూలరు, దుస్తులు, వంట పాత్రలు, కుట్టు మిషను పూర్తిగా కాలి బూడిదయాయి. ఈ మేరకు తహసీల్దారు ఫణికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని వీఆర్వో రెడ్డి శేఖర్ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.



కాలిపోయిన వస్తువులు

ఆటో బోల్తా... ఏడుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో బోల్తా పడి ఏడుగురు గాయపడిన ఘటన కురబలకోట మండలంలో గురువారం జరిగింది. మండలంలోని తెట్టు పంచాయతీ ఆరోగ్యపురానికి చెందిన కుమార్ (33) ఆటోలో అదే గ్రామానికి చెందిన రాజమ్మ (60), సులోచన (50), అమరావతి (41), సుబ్బమ్మ (40), రెడ్డెప్ప (50), రమణయ్య (52) కూలి పనుల కోసం బయలుదేరారు. రాత్రి కురిసిన వర్షానికి ఆటో దిగువపాళ్యానికి సమీపంలోకి వచ్చే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారు గాయపడ్డారు. వీరిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో రాజమ్మ, సులోచనలను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన రాజమ్మ



డ్రైవర్ కుమార్

నల్లమచ్చ తెగులుతో రైతుల ఆందోళన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : టమాట సాగుకు పేరొందిన మదనపల్లె డివిజన్‌లో పంటను నల్లమచ్చ తెలుగు ఆశిస్తోంది. దీని వల్ల మొక్క ఎదుగుదలతో పాటు దిగుబడులపై ప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు బూడిద తెగులు కూడా సోకిందని రైతులు వాపోతున్నారు. రెండు రోజులుగా ధరలు పైకి ఎగబాకడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నల్లమచ్చ తెలుగు సోకడం వల్ల ఆకులు మాడిపోవడం, పూత రాలిపోవడం వంటివి జరుగుతున్నాయని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మదనపల్లె పరిసర ప్రాంతాల్లో టమాట పంటకు నల్లమచ్చ తెగులు ఎక్కువగా సోకుతుంది.

తక్షణ చర్యలు అవశ్యం

నల్లమచ్చ తెగులు నివారణకు నత్రజని ఎరువులు వినియోగం తగ్గించాలి. గ్రాము అమిస్టర్ టాప్, లేదా 0.4 గ్రాములు మెరివోన్, లేదా 2 ఎంఎల్ కావచ్‌ఫ్లో మందుల్లో ఏదో ఒకదానిని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల బూడిద తెగులు ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. తక్కువ ఉద్ధృతి ఉంటే 2 గ్రాములు ఇండెక్స్ మందుకు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలి. ఎక్కువ ఉద్ధృతి ఉన్నట్లైతే 1.2 గ్రాములు పిలిన్ మందుకు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలి. కాయపైన నల్లటి బ్యాక్టీరియా మచ్చలు ఎక్కువయ్యే అవకాశం ఉంటే 0.5 గ్రాములు ఫ్లోంటోమైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే తెల్లదోమ, పచ్చదోమ నివారణకు 1.2 ఎంఎల్ సిమోడిన్ మందుకు లీటరు నీటిని లేదా 1 ఎం.ఎల్ గ్రేషియా మందుకు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలి. డ్రిప్‌లో ఎకరాకు 5 కిలోలు మెగ్నీషియం సల్ఫేట్, మూడు 19లు 5 కిలోలు, ఆగ్రోవిన్‌మాక్స్ 2 కిలోలు పంపాలి. **- ఈశ్వరప్రసాద్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి, మదనపల్లె**



నల్లమచ్చ తెగులు సోకిన టమాట మొక్కలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

రామసముద్రం, న్యూస్‌టుడే: అరికెల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మధులత రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గురునాథం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గంగవరం ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో విద్యార్థిని రాణించింది. దీంతో విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటారని తెలిపారు. పాఠశాలలో గురువారం విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు, ఎస్ఎంసీ అధ్యక్షుడు భువనేశ్వర్‌రెడ్డి, పీడీ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.



మధులత

రాజంపేట ప్రభుత్వాసుపత్రి తనిఖీ

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు సమస్యలను తెలుసుకోవడానికి విజయవాడకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నాగలక్ష్మి గురువారం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రతి భాగాన్ని పరిశీలించారు. రోగుల రక్త, ఇతర పరీక్షలు, దస్త్రాలు చూశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పనితీరుపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆమె తనిఖీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

రూ.25.50 లక్షలకు వ్యాపారి ఐపీ

పీలేరు, న్యూస్‌టుడే: వ్యాపారంలో నష్టం రావడంతో పాటు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో అప్పులు తీర్చే పరిస్థితి లేక పీలేరు ఎర్రమరెడ్డి గుట్టకు చెందిన మూడే వాసుదేవ నాయక్ (48) గురువారం పీలేరు సీనియర్ సివిల్ న్యాయమూర్తి కోర్టులో ఇన్‌సాల్వేన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేశారు. తాను సుండపల్లె, కంభంవారిపల్లె మండలాలకు చెందిన 17 మందికి అప్పు చెల్లించాల్సి ఉందని దావాలో తెలిపారు. వాసుదేవ నాయక్ గత కొంతకాలంగా పీలేరులో నివాసం ఉంటూ సీజనల్‌గా పండే వరి, వేరుసెనగ, ఉలవ పంటలతో పాటు గొర్రెల వ్యాపారం చేస్తుండేవారు. ఈక్రమంలో వ్యాపారానికి తెలిసిన వారి నుంచి రూ.25.50 లక్షల మేరకు అప్పులు తీసుకున్నారు. అప్పులిచ్చిన వారు బాకీలు తీర్చాలని ఒత్తిడి చేయడంతో తీర్చే పరిస్థితి లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఐపీ దాఖలు చేసినట్లు దావాలో వివరించారు. వాసుదేవ నాయక్ తరపున న్యాయవాది షౌకత్ ఆలీ న్యాయస్థానంలో ఐపీ పిటిషన్ దాఖలు చేశారు.

తోటలో పైపుల ధ్వంసం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మోటుపల్లోళ్లపల్లెకు చెందిన రైతు రవీంద్ర నాయుడి టమాట తోటను బుధవారం అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఊరికి సమీపంలో రైతు తోటను సాగు చేశారు. బాధిత రైతు రవీంద్ర నాయుడు మాట్లాడుతూ... ఉదయం తోట వద్దకు వెళ్లగా తోట పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో టమాటాను సాగు చేశానని, పంట చేతికొచ్చే సమయానికి తనపై కక్ష్యతో ఈ విధంగా చేశారని ఆరోపించారు. తోట, పైపులు ధ్వంసం కావడంతో రూ. లక్షల్లో నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.



ధ్వంసమైన తోట

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు సాధించిన క్రీడాకారులతో ప్రిన్సిపల్ యువరాజ్, అధ్యాపకులు

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : క్రీడా పోటీల్లో మిట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో సన్‌యోగ్-2024 ఇటీవల క్రీడా పోటీలను ఏర్పాటు చేయగా, ఇందులో 100 మీటర్ల పరుగు పందెంలో వై.వెంకటయ్యకు బంగారు పతకం, లాంగ్ జంప్, డిస్కస్‌త్రోలో హెచ్.నరేంద్రకు కాంస్యం పతకాలు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. బ్యాడ్మింటన్ పోటీల్లో బి.ఆమోస్, కే.హేమంత్‌కుమార్‌రావు, ఎస్.అబ్దుల్ మూకీత్, కే.దిలీప్‌కుమార్, ఏ.చందు రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. విజేతలను కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్ ప్రశంసించారు.

ఆట స్థలంలో రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ ఎదుట ఉన్న పాత కళాశాల మైదానం మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టరాదని తంబళ్లపల్లె గణేష్ యూత్ సభ్యులు, స్థానికులు గురువారం తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తంబళ్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న పౌర సరఫరాల గోదాంకు మైదానం మీదుగా రోడ్డు వేయడానికి గుత్తేదారు యత్నిస్తున్నాడని చెప్పారు. ఈ మైదానం చుట్టూ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ, విద్యుత్తు, విద్య, దేవాదాయశాఖ కార్యాలయాలు ఉన్నాయని, దీంతో ఈ మైదానం నిత్యం ఆటలాడుకునే పిల్లలు, ప్రజలతో రద్దీగా ఉంటుందన్నారు. ఈ ఆట స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడితే గోదాంకు వచ్చి వెళ్లే పెద్ద పెద్ద లారీలతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి మణి, స్థానికులు చంద్రశేఖర్, బాలకృష్ణ, రవి, రెడ్డి, గణేష్ యూత్ సభ్యులు శంకర, జనార్ధన్, శ్రీకాంత్, నవీన్, ప్రసాద్, సుజన్, శేషు పాల్గొన్నారు.



తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న రెడ్డి కల్యాణి రగ్బీలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు రమీజా గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జిల్లా టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలు కర్నూలులో నిర్వహించారు. ఇందులో రెడ్డి కల్యాణి ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రిన్సిపల్ పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.



రెడ్డికల్యాణి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మదనపల్లె డివిజన్‌తో పాటు జిల్లావ్యాప్తంగా అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర సరిహద్దులు దాటింటి కర్ణాటకకు ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. రాజంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఏర్పాటు చేసిందని, మిగిలిన అయిదు నియోజకవర్గాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయలేదని, దీని కారణంగా అక్రమార్కులు మిగిలిన నియోజకవర్గాల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని చెబుతున్నా ప్రభుత్వ అనుమతులు లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా లోడు ఇసుకను వేలాది రూపాయలకు విక్రయిస్తూ ప్రజల నుంచి దోపిడీ చేస్తున్నారని, జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఉపాధి కోల్పోతున్నారని, ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల్లో ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకురాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

మదనపల్లె
•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ


ములకలదిన్నెలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం: ములకలదిన్నెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి ప్రణాళికతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారన్నారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతోందన్నారు. స్థానికులు ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించారు. అనంతరం ములకలదిన్నె క్రాస్‌కు ఎన్టీఆర్ క్రాస్‌గా నామకరణం చేశారు. తెదేపా నాయకులు ఎన్. విద్యాసాగర్, నవీన్‌చౌదరి, వేణు, సంగం హరి పాల్గొన్నారు.

పర్యాటకం గ్రంథావిష్కరణ


గ్రంథావిష్కరణ చేస్తున్న నవలా రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి, సభ్యులు

మదనపల్లె పట్టణం: బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విశ్రాంత సంయుక్త కార్యదర్శి ఆలపర్తి పిచ్చయ్యచౌదరి రచించిన పర్యాటకం గ్రంథావిష్కరణ, పరిచయ సభ మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఇందిరానగర్ శ్రీసాయి నిలయంలో గురువారం నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి పర్యాటక గ్రంథాన్ని పరిచయం చేశారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అధ్యయనం చేయదగ్గ గ్రంథమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిచ్చయ్య చౌదరి దంపతులు కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో విద్యోదయ పాఠశాల కరస్పాండెంట్ పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణ: మండలంలోని చీకలబైలు పంచాయతీలో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో పాటు, బార్లపల్లె బస్టాప్‌లో చెత్తచెదారం పేరుకుపోవడంతో స్థానికులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో సెప్టెంబరు 14న కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి రవి స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లించారు. బస్ షెల్టర్‌కు సున్నం కొట్టించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మదనపల్లె గ్రామీణ: నీరుగట్టువారిపల్లెలో తాత్కాలిక పనులు చేపట్టి మురుగు నిల్వలేకుండా కార్మికులు చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని మారుతీనగర్‌లో మురుగు అధ్వానంగా ఉండటంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'ఈనాడు'లో ఆగస్టు 29న 'మారుతీనగర్‌లో అసౌకర్యాలదే రాజ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మురుగునీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: అంకిశెట్టిపల్లె పంచాయతీ కేంద్రంలోని సచివాలయం వెనుకవీధిలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. అయిదురోజులైన నీరు రాలేదు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి? **- రాజన్న, అంకిశెట్టిపల్లె, మదనపల్లె**

✔: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- భానుప్రసాద్, ఎంపీడీవో, మదనపల్లె**

?: బసినికొండ పంచాయతీ జన్మభూమి కాలనీలోని దర్గా వద్ద చేతిపంపు పనిచేయడం లేదు. మరమ్మతులు చేపడితే తాగునీటి సమస్య ఉండదు? **- ఆనంద్, బసినికొండ**

✔: చేతిపంపును పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **- విష్ణు, కార్యదర్శి, బసినికొండ**

?: రాజీవ్‌నగర్ విస్తరణ ప్రాంతంలోని ప్రధాన మార్గంలో చుట్టుపక్కల ఇళ్ల నుంచి చెత్తచెదారాన్ని తీసుకొచ్చి ఇళ్ల మధ్యలో వేస్తున్నారు. దుర్వాసనతో దోమల నిలయంగా మారింది? **- రామ్మోహన్, రాజీవ్‌నగర్**

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టి, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, కమిషనర్, మదనపల్లె**

అభివృద్ధి పనులకు ఆటంకాలు

● ఆరు నెలలుగా ఆగిన సిమెంటు సరఫరా ● ఇసుక కొరతతో ముందుకురాని గుత్తేదారులు ● పురపాలికలో బకాయిలు రూ.2 కోట్లుపైనే


ఇది పట్టణంలోని కదిరిరోడ్డు ప్రశాంత్‌నగర్ వద్ద 140 మీటర్ల పొడవు, 5 అడుగులు లోతు నిర్మించిన కాలువ. రూ.35 లక్షలు అంచనా వ్యయంతో సాధారణ నిధులు కింద పనులు పూర్తి చేయించారు. ఆ పని పూర్తి చేసిన గుత్తేదారుకు ఒకటిన్నర సంవత్సరం పూర్తయినా ఇంత వరకు ఒక్క రూపాయి బిల్లు చెల్లించలేదు.

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘంలో అభివృద్ధి పనులకు అనేక ఆడ్డంకులు ఎదురౌతున్నాయి. వీటన్నింటినీ అధిగమించి అభివృద్ధి ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సంవత్సరాల తరబడి బిల్లులు రాకపోవడం, ప్రభుత్వం సరఫరా చేసే ఓపీసీ సిమెంటు ఆపేయడం, ఇసుక దొరక్కపోవడం వీటికి తోడు మరోవైపు సాంకేతిక సమస్యలు అభివృద్ధికి ఆటంకాలుగా ఏర్పడ్డాయి.

● పురపాలక సంఘంలో చేసే అభివృద్ధి పనులకు ప్రభుత్వం గుత్తేదారులకు రాయితీ ధరతో ఓపీసీ సిమెంటు సరఫరా చేస్తుంది. గత ఆరు నెలలుగా ప్రభుత్వం సరఫరా ఆపేసింది. ఓపీసీ సిమెంటును బస్తా రూ.275లకు ప్రభుత్వం సరఫరా చేసేది. బయట మార్కెట్‌లో సిమెంటు బస్తా రూ.340 ధర పలుకుతోంది. ఒకప్పుడు ఇది రూ.380 ఉండగా, పనులు లేకపోవడంతో ధరను తగ్గించారు. ఓపీసీ సిమెంటు సరఫరాను ఆపేయడంతో బయట మార్కెట్‌లో సిమెంటు కొనలేక గుత్తేదారులు పనులు ఆపేశారు.

● మదనపల్లె పరిసరాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఇసుక కొరత మరో కారణం. ప్రత్యేకించి పురపాలక సంఘంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఇసుక కొరత ప్రధాన సమస్యగా మారింది. జిల్లాలో రాజంపేట మినహా ఎక్కడా అధికారిక ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయలేదు. ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు చేస్తే ప్రభుత్వమే రవాణా ఛార్జీలు, టోల్‌గేట్ బిల్లులు భరించనుంది. మదనపల్లె పరిసర మండలాల్లోని వాగులు, వంకల్లో ఇసుక లభించకపోవడంతో అభివృద్ధి పనులు ఆపేశారు.

సమస్యగా మారిన ప్రీ ఆడిట్...

పురపాలక సంఘంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గుత్తేదారులు ప్రీ ఆడిట్ చేయించుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఇందుకోసం ఒక ఆడిటర్‌ను పురపాలక సంఘంలో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఈ పద్ధతిని రద్దు చేసి జిల్లా కేంద్రమైన రాయచోటికి మార్చారు. ఈ పద్ధతిని మార్చాలని గుత్తేదారులు పలుమార్లు కమిషనర్‌కు విన్నవించారు. రూ.10 వేలు నుంచి లక్షల రూపాయలతో చేపట్టే పనులను జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి ప్రీఆడిట్ చేయించుకురావాలి. దీని వల్ల గుత్తేదారులకు ఇబ్బందులు తప్పకపోగా, మరో వైపు అభివృద్ధి పనులు ఆలస్యమౌతున్నాయి.

ముందుకురాని గుత్తేదారులు...

గత 13వ తేదీ 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు కింద పలు అభివృద్ధి పనులు చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. మొత్తం 29 పనులకు గానూ అధికారులు టెండర్లు నిర్వహించగా, ఇందులో 9 పనులకు మాత్రమే గుత్తేదారులు టెండర్లు వేసుకున్నారు. మిగిలిన 20 పనులకు ఎవరూ టెండర్లు వేయలేదు.


అప్పారావుతోటలో నిర్మించిన మురుగు కాలువ

రూ.2 కోట్లు పైబడి బకాయిలు...

పురపాలక సంఘంలో పూర్తి చేసిన పనులకుగానూ రూ.2 కోట్లు పైబడి బకాయిలు చెల్లించాల్సి ఉంది. సంవత్సరాలు గడిచిపోతున్నా గుత్తేదారులకు బిల్లులు చెల్లింపు జరగలేదు. వీటికోసం వారు ప్రతి రోజు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అప్పారావుతోటలో కాలువలు, కల్వర్టుల నిర్మాణం పనులకు రూ.25 లక్షలు పైబడి చెల్లించాల్సి ఉంది. పనులు పూర్తయి సంవత్సరం గడిచినా ఇంత వరకు చెల్లించలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని అంటున్నారు.

సీఎంఎఫ్ఎస్‌కు బిల్లులు పంపాం

అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు చాలా వరకు సీఎంఎఫ్ఎస్‌కు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయి. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం.

- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం

వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపిక

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరుకు చెందిన ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి హేమంత్‌నాయక్ అండర్-17 జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు గురువారం తెలిపారు. ఈ విద్యార్థి శ్రీసత్యసాయి జిల్లాలో జరగబోయే క్రీడల్లో పాల్గొంటాడని ఆయన తెలిపారు.

ధర్మయుద్ధ మహాసభ 6న

కలికిరి, వాల్మీకిపురం న్యూస్‌టుడే: ఈ నెల 6వ తేదీ రాయచోటిలోని ఎన్జీవో హాల్‌లో జరిగే హలో మాల... చలో రాయచోటి ధర్మయుద్ధ మహాసభకు తరలి రావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, మండల అధ్యక్షుడు నాగార్జున, ఉపాధ్యక్షుడు చింతపర్తి అశోక్ పిలుపునిచ్చారు. గురువారం వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లె, చిన్నగంగులవారిపల్లె గ్రామంలో కరపత్రాల ద్వారా అవగాహన కల్పించి సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట స్వామి, జిల్లా కార్యదర్శులు గాంధీపేట సుధాకర్, శ్రీనివాసులు కమిటీ సభ్యులు అనిల్, రమణ, బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు తీవ్ర గాయాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : కరెంటు స్తంభంపై నుంచి పడి ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం, ఇట్నేవారిపల్లికు చెందిన ఈశ్వరయ్య మల్లయ్యకొండ శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొండపైన వీధి దీపాలు మరమ్మతులు చేసే క్రమంలో విద్యుత్తు సరఫరా కావడంతో స్తంభంపై నుంచి కిందపడి గాయపడ్డాడు. అక్కడి సిబ్బంది తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

తేనెటీగల దాడిలో రైతుకు గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తేనె టీగల దాడిలో రైతులు తీవ్రంగా గాయపడిన ఘటన తంబళ్లపల్లె మండలంలో గురువారం జరిగింది. మండలంలోని రెడ్డికోట పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన రైతు ఈశ్వరయ్య (56) పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న తేనె టీగలు ఆయనపై దాడిచేసి గాయపర్చాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆబ్కారీ సిబ్బంది బాధ్యతల స్వీకరణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లలో ఎస్‌ఐలుగా జబీవుల్లా, డోర్కాస్ గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు సీఐ భీమలింగా తెలిపారు. వీరితో పాటు నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు స్టేషన్‌కు వచ్చారన్నారు. స్టేషన్ పరిధిలో మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో కర్ణాటక అక్రమ మద్యం అక్రమ రవాణా అరికట్టడంతో పాటు సారా తయారీ నిర్మూలిస్తామన్నారు. అలాగే గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి సరఫరా కాకుండా చేయడంతో పాటు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా సారా, కర్ణాటక మద్యం విక్రయాలు ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కొవ్వొత్తులతో ముస్లింల నిరసన


కలికిరి నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కలికిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కలకలం లేపిన చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన చిన్నారి (7) ఉదంతంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లింలు కొవ్వొత్తులతో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆదివారం అదృశ్యమైన బాలిక పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బుధవారం శవమై తేలిందని, సమగ్ర విచారణ జరిపి మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో గాంధీ విగ్రహం వద్ద ఉల్మాయే హింద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్తఫా హజరత్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ : పుంగునూరులో బాలిక మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాలు, ముస్లిం సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీలేరు, కలికిరిలో ఉల్మాయ హింద్ జిల్లా ప్రధాన అజ్రత్ ముస్తఫా ఆధ్వర్యంలో చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా శరన్నవరాత్రులు ప్రారంభం


మదనపల్లెలో బాలా త్రిపుర సుందరిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


కురబలకోటలో మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి


కలికిరిలో బాలా త్రిపుర సుందరీ దేవిగా ఎల్లమ్మ


రామసముద్రంలో పసుపు అలంకారంలో వాసవీదేవి


రామసముద్రంలో హరిద్ర అలంకారంలో దుర్గాదేవి

శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దసరా సందడి మొదలవడంతో ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో కమిటీ ఛైర్మన్ పురాణం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సేతు స్వామి, అర్చకులు రాముస్వామి పర్యవేక్షణలో అమ్మవారిని హరిద్ర అలంకారంతో తీర్చిదిద్దారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు రామచంద్రశర్మ జగన్నాతను బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. ప్రసన్న వేంకన్న ఆలయం, సోమేశ్వరాలయం, మడికయ్యల శివాలయం, రాగిమానుకూడలిలోని దుర్గాదేవి ఆలయం, సీటీఎంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, పడమరవీధిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో అమ్మవారికి విశేష అలంకరణతో పాటు వివిధ అవతారాల్లో అలంకరించారు. కార్యక్రమాల్లో చౌడేశ్వరి ఆలయ కమిటీ కార్యదర్శి బండి పవన్‌కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు దసరా సందడితో కళకళలాడాయి. ఆయా కార్యక్రమాల చిత్రాలివి.


విద్యుద్దీపాలంకరణలో నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి ఆలయం

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం

వైభవోపేతంగా సోమేశ్వరస్వామి పండగ


అగ్నిహోత్రం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని సాలె వీధిలో వెలసిన శ్రీసోమేశ్వరస్వామి పండగ గురువారం భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి తులసి పూజ, మారేడు దళ పూజ, ప్రత్యేక పుష్పాలంకరణ, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, హారతులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో అగ్నిహోత్రం, శాంతి పూజలు నిర్వహించారు. చివరిగా ధ్వజస్తంభం దీపారాధన ఆలయ మాడ వీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో బాటు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధులు సమాజ మార్గదర్శకులు

కలికిరి, వాల్మీకిపురం న్యూస్‌టుడే: వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని వారి ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రద్ధ వహించాలని సూపరింటెండెంట్ పవన్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వాల్మీకిపురం చౌడేశ్వరి వృద్ధుల ఆశ్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు.

మదనపల్లె విద్య: వయోవృద్ధులకు ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ అన్నారు. గురువారం మదనపల్లెలో ఉన్న సీనియర్ సిటిజన్ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి రమణ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలియడంతో వారు ఆయన ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆయనకు అవసరమైన పండ్లు, ఫలహారాలు అందజేశారు. రమణకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. రమణను బాగా చూసుకోవాలని వారికి తెలియజేశారు. వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.


కలికిరి సీహెచ్‌సీలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది

ఆయుష్మాన్ భారత్ పత్రాల పంపిణీకి వినతి


అర్జీ సమర్పిస్తున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నిరుపేదలు వైద్యసేవలు పొందేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ చేయాలని ఎంపీడీవో మస్తాన్‌వలీకి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని సచివాలయాల్లో చాలామందికి ఈ కార్డు పంపిణీ చేయలేదని, ఈ కార్డు ద్వారా ప్రతి పౌరుడికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించబడుతుందన్నారు. దీనిపై అవగాహన లేక ప్రాణాంతక రోగాలబారినపడినప్పుడు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ కార్డు ఒక సంవత్సరం వరకు వినియోగంలోకి వస్తుందని, తిరిగి పునరుద్ధరించుకోవాల్సి ఉంటుందన్నారు. పంపిణీ కాని కార్డులను వెంటనే లబ్ధిదారులకు అందించాలని కోరారు.

వాన వెలిసింది... బురద నిలిచింది


మదనపల్లె ఆర్టీసీ బస్టాండు రోడ్డులో వర్షపునీరు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్‌లోని నాలుగు మండలాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులన్నీ బురదమయంగా మారాయి. మదనపల్లె డివిజన్ కేంద్రంలో భారీ వర్షం కురవగా 76 మి.మీ.లుగా నమోదైంది. కురబలకోటలో 40.2 మి.మీల వర్షం కురిసింది. రామసముద్రం, నిమ్మనపల్లె మండల కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో రోడ్డుపై వర్షపునీరు నిలబడి బురదమయంగా మారింది. గ్రామీణ మండలం పోతబోలు, వలసపల్లె పంచాయతీల పరిధిలోని జగనన్న కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడింది. పలు పంచాయతీల్లోని గ్రామాల్లో అంతర్గత రహదారులపై నీరు నిలిచి బురదగా మారింది.


రెహమ్మత్‌నగర్‌లో బురదమయంగా...


పోతబోలు జగనన్న కాలనీలో ఇలా...

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి


సమస్యలపై మాట్లాడుతున్న వార్డు సభ్యురాలు సుకన్య

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణంలో దోమల బెడద పెరిగినందున ప్రజలకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పలువురు పంచాయతీ వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం పీలేరు పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచి హబీబ్‌బాషా అధ్యక్షతన జరగింది. సభ్యురాలు సుకన్య మాట్లాడుతూ... కామాటంపల్లె ప్రాంతంలో తాగునీటి శుద్ధి జల ప్లాంట్ల నిర్వాహకులు నిర్ణీత వేళల్లో తాగునీరు కుళాయిల్లో వదలడం లేదని చెప్పారు. తాగునీటి ప్లాంట్లను శుభ్రం చేసే నిర్వాహకులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని కోరారు. గతంలో పంచాయతీలో ప్రజలకు నీటిఎద్దడి వచ్చినప్పుడు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసిన ట్రాక్టర్ల యజమానులకు బిల్లులు చెల్లించాలని సభ్యులు మల్లికార్జునరెడ్డి కోరారు. సర్పంచి హబీబ్‌బాషా మాట్లాడుతూ... గత తొమ్మిది నెలలు తాను సెలవులో ఉన్నప్పుడు పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైందని నాలుగు రోడ్ల కూడలి నుంచి చిత్తూరు, కడప మార్గాల్లో డివైడర్ల వద్ద నాటిన మొక్కలు చనిపోయాయని, వీధి దీపాలు కూడా వెలగడం లేదని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకుని దీపాలు ఏర్పాటు చేయాలని పాలన గాడిలో పెట్టాలని కోరారు. పంచాయతీలో పనులు చేసిన వారికి, విద్యుత్తు పరికరాలు, పారిశుద్ధ్య సామగ్రి సరఫరా చేసిన వారికి మొత్తం రూ.3.29 కోట్ల మేరకు అప్పులు చెల్లించాల్సి ఉందని కార్యదర్శి సభాముఖంగా సభ్యులకు వివరించి ఆర్థిక పరిస్థితి కుదుట పడే వరకు అత్యవసర పనులు మాత్రమే చేయగలమని వివరించారు. ఇరవై మంది సభ్యులకు పన్నెండు మంది మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, వార్డు సభ్యులు హబీబ్, కాలేషా, శ్రీనాథరెడ్డి, షాజహాన్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

తాగునీటి సమస్యకు పరిష్కారం


తాగునీటి బోరుకు పూజలు చేస్తున్న ఎన్ఆర్ఐ శశిభూషణ్

సంబేపల్లె(రాయచోటి) : తాను పుట్టిన ఊరికి సహకారం అందించాలనే ఉద్దేశంతో ఓ ప్రవాసాంధ్రుడు గ్రామస్థుల దాహార్తి తీర్చారు. సంబేపల్లెలో తాగునీటి ఎద్దడి నెలకొంది. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోరు వేయించారు. కానీ నిధుల సమస్యతో మోటారు అమర్చలేదు. సమస్యను అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు శశిభూషణ్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. ఆయన వెంటనే రూ.2 లక్షలు ఆర్థికసాయం అందించడంతో గ్రామస్థులు మోటారు, విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేశారు. బోరులో నీరు రావడంతో తాగునీటి సమస్య తీరింది. ఇటీవల శశిభూషణ్ గ్రామంలోని పాఠశాలకు రూ.లక్షల విలువైన క్రీడా పరికరాలు, కంప్యూటర్లు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి


పంట దిగుబడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

సుండుపల్లి, న్యూస్‌టుడే : ఖరీఫ్ పంట ఈకేవైసీ సూపర్ చెక్‌లో భాగంగా సుండుపల్లి పుల్లారెడ్డిగారిపల్లెలో బి.సుబ్బరాయుడు వేరుసెనగ పొలాన్ని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ గురువారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రైతుసేవా కేంద్ర సిబ్బంది నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. మండలంలో ఇంకా ఈకేవైసీ పూర్తి కాని పంటలు ఉంటే త్వరగా పూర్తి చేయాలని సూచనలిచ్చారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయఅధికారి(టెక్నికల్) ఎం.వెంకటమోహన్, ఆర్ఎస్‌కే సిబ్బంది ముకుంద, రైతు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

?: రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేటలో వారానికి ఒక సారి కూడా చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడంలేదు. మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. - ఎన్.సురేష్‌నాయుడు, స్థానికుడు

✔: నరసరాంపేటలో కప్పతొట్టు ఏర్పాటు చేసినా ప్రజలు పరిసరాల్లోనే చెత్తాచెదారాలు విసిరేస్తున్నారు. వారికి అవగాహన కల్పిస్తాం. ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. - బుడిగె శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు

- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

?: ఓబులవారిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం 24 గంటలు పని చేయాలని ప్రభుత్వ నిబంధనలున్నా, సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత సిబ్బంది ఆసుపత్రిలో ఉండటం లేదు. దీంతో రాత్రివేళ అత్యవసరం అయితే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలకు రాత్రి వేళ వైద్య సేవలు అందేలా చూడాలి. - చంద్రశేఖర్, ఓబులవారిపల్లె

✔: రాత్రి వేళ స్టాఫ్ నర్సును అందుబాటులో ఉండేలా చూస్తాం. మండల కేంద్రంలో నిబంధనల ప్రకారం 24 గంటలు వైద్యులు ఉండాలి. వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం. - శేఖర్, ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో, రాజంపేట

- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

?: పట్టణంలోని రైల్వేకోడూరు మార్గంలో మురుగు కాలువ దారుణంగా ఉంది. మురుగు ప్రధాన రహదారిపై పారుతున్నా పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కరించండి. - రామచంద్రయ్య, స్థానికుడు

✔: సమస్య పరిష్కారానికి కాలువ వెడల్పు చేసి పనులు చేయడానికి టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదు. మళ్లీ పిలుస్తున్నాం. పనులు జరిగితే సమస్య పరిష్కారమవుతుంది.

- మల్లేష్, పురపాలక ఏఈ, రాజంపేట - న్యూస్‌టుడే, రాజంపేట

?: పట్టణంలోని ఒంటెల సిద్ధయ్య వీధిలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఇళ్లలోని మురుగునీరు రోడ్డు మీదకు వస్తుండడంతో ప్రజలు దోమల బారిన పడుతున్నారు. - శ్రీకాంత్, రైల్వేకోడూరు

✔: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- ప్రసాదరావు, కార్యదర్శి - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు గ్రామీణ

?: రాజంపేట మండలం పోలి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇళ్ల నుంచి వచ్చే మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - పోలి గ్రామస్థులు

✔: ఇళ్ల నుంచి వృథాగా నీరు బయటకు వదలకుండా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే బాధ్యులకు నోటీసులు ఇస్తాం. సమస్య లేకుండా చేస్తాం. - హరి ప్రసాద్‌రెడ్డి, ఈవోపీఆర్డీ

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

?: చిన్నమండెం పట్టణంలోని సినిమా హాల్ దగ్గర వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

✔: వీధి దీపాలను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, చిన్నమండెం


రామాపురం: దర్గానగర్ ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో...


చిన్నమండెం రాజరాజేశ్వరీగా కన్యకాపరమేశ్వరీదేవి


వెంకటరాజంపేటలో ధనలక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


రాజంపేటలో భక్తులకు దర్శనమిస్తున్న వాసవీ మాత


సుండుపల్లి అమ్మవారి శాలలో బాలత్రిపురసుందరిగా...

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

దసరా దేవి నవరాత్రి ఉత్సవాలు రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూఉ నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా రాయచోటి పట్టణంలోని ఆలయాలను రంగు రంగుల విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గాంధీబజార్‌లో వెలసిన శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి తొలి రోజు వాసవాంబదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శివాలయం కూడలిలోని శివనంది ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో, వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు భద్రకాళీదేవిగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం


రాయచోటి ఎస్ఎన్‌కాలనీ శివాలయంలో పార్వతీదేవి అలంకరణ


నందలూరు మండలం నాగిరెడ్డిపల్లిలో వాసవీమాత



రాయచోటి గాంధీబజార్‌లో వాసవీమాత


రాజంపేటలో ఊరేగింపుగా ఆర్యవైశ్య మహిళలు

పాలేటమ్మకు బోనాల సమర్పణ

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన గ్రామస్థులు గురువారం వర్షం కోసం పాలేటమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామం నుంచి కాలినడకన మహిళలు బోనాలు తీసుకొని దేవళంపేటలో వెలసిన అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి చీర, పసుపు, కుంకుమతో పాటు బోనాలను సమర్పించారు. టెంకాయలు కొట్టి వర్షాలు కురవాలని అమ్మవారికి ప్రార్థనలు చేశారు.


అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న రెడ్డివారిపల్లె గ్రామస్థులు

శ్మశానవాటిక హద్దులు చూపాలని నిరసన

సుండుపల్లి, న్యూస్‌టుడే : శ్మశానవాటికకు హద్దులు చూపాలని దిగువగుల్లావాండ్లపల్లె వాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. మూడురోజుల కిందట శ్మశానవాటిక వంకపక్కన ఉన్న స్థలంలో కంపచెట్లు తీస్తుండగా స్థానికులు నిరసన తెలిపి తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. స్థలాన్ని కొలిచి హద్దులు నిర్ణయించాలని ప్రజలు కోరారు. కొలతలు వేయిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చినా అధికారులు రాకపోవడంతో దిగువగుల్లావాండ్లపల్లెకు చెందిన ప్రజలు శ్మశాన స్థలంలో నిరసన తెలిపారు. అనంతరం సుండుపల్లె కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి స్థలాన్ని రక్షించాలని, వెంటనే కొలతలు వేయాలని తహసీల్దారును కోరారు. ఈ విషయమై తహసీల్దారు ఎం.దైవాదీనం మాట్లాడుతూ.. మండల సర్వేయరు బదిలీ అయ్యారని, ఇంకా ఎవరూ రాలేదన్నారు. కొలతకు యంత్రం కూడా అందుబాటులో లేనందున కొలత వేయించలేకపోయామని స్పష్టం చేశారు. జిల్లా సర్వే అధికారులతో మాట్లాడామని త్వరలో స్థలం కొలతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఆందోళన చేస్తున్న దిగువగుల్లావాండ్లపల్లె వాసులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేట పుర సభా భవనంలో ఛైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పట్టణంలో రహదారులు, మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశంలో ఆమోదం తెలిపిన పనులకు టెండర్లు పిలవకుండా, అరకొర జరిగే పనులకు బిల్లులు చెల్లించకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సభ్యులు తెలిపే సమస్యలను అధికారులు విని వదిలేస్తున్నారని వాపోయారు. ఈ సమయంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కల్పించుకుని సభ్యులు తెలిపే సమస్యలు నమోదు చేసుకోవాలని, వచ్చే సమావేశంలో ఈ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనరు నాగేశ్వరరావు వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన తెదేపా నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారికంగా నిర్వహించాల్సిన ఉపాధి హామీ గ్రామసభను అధికారులే బాయ్‌కాట్ చేయడమేంటి అని ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ రంగయ్యను తెదేపా నాయకులు నిలదీశారు. మండలంలోని కొండమాచుపల్లె పంచాయతీ కార్యాలయంలో ఉపాధి పనుల గుర్తింపుపై గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి కుమార రంగయ్య, ఏపీవో శివశంకర్‌రెడ్డి, సాంకేతిక నిపుణులు శ్రీవాణి, దస్తగిరి హాజరయ్యారు. వైకాపా, తెదేపా వర్గీయులు, స్థానికులు కూడా వచ్చారు. వేదికపై సర్పంచి శివనారాయణ, అధికారులు కూర్చోగా, గ్రామ తెదేపా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులుకు అతిథి స్థానం కల్పించాలని నాయకులు అభ్యర్థించారు. వారొస్తే తాను సభలో ఉండనని సర్పంచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయినా సమావేశాన్ని నిర్వహించాలని తెదేపా నాయకులు అడిగారు. ఆ సమయంలో అధికారులు, నేతల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకొంది. సహనం కోల్పోయిన ఈవోపీఆర్డీ గ్రామసభను బాయ్‌కాట్ చేస్తున్నా అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏపీవో, టీఏలు ఆయనను అనుసరించారు. దీంతో తెదేపా నాయకులు ఎంపీడీవోరెడ్డెయ్య దృష్టికి ఈ సమస్యను తీసుకొచ్చారు. గ్రామసభను నిర్వహించాల్సిన వారే అనుచితంగా మాట్లాడమేంటి అంటూ ప్రశ్నించారు. వైకాపా సర్పంచి చేపట్టిన పనులపై మూడు నెలలుగా ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. చివరికు ఈవోపీఆర్డీ ఘటనపై క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. త్వరలో మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. నాయకులు శ్రీవారి, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

డీటీ బాధ్యతల స్వీకరణ


జ్యోతి

పెనగలూరు, న్యూస్‌టుడే : పెనగలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం.జ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నందలూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

సుండుపల్లి, న్యూస్‌టుడే : సంబేపల్లెకు బదిలీపై వెళుతున్న ఎంపీడీవో ఎన్.రామచంద్రను గురువారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పలువురు సన్మానించారు. తెదేపా నాయకుడు వై.శివరామి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీవో రామచంద్రను సన్మానిస్తున్న తెదేపా నాయకుడు శివరామిరెడ్డి, సిబ్బంది

కరపత్రాల ఆవిష్కరణ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం రాయచోటి పట్టణంలో నిర్వహించే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ్ తెలిపారు. రాజంపేట మండలం పోలి మాలపల్లి, సీతారామపురం గ్రామాల్లో సభకు సంబంధించి కరపత్రాలను గురువారం విడుదల చేశారు. అనంతరం గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నేతలు

నవోదయ ప్రవేశాలకు ఆహ్వానం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం నారంరాజుపల్లి వద్ద ఉన్న నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని గురువారం ప్రిన్సిపాల్ గీతా తెలిపారు. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8, 10 తరగతి చదువుతున్న వారు మాత్రమే నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

వీరభద్రయ్య విగ్రహావిష్కరణ

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి మొదటి మున్సిపల్ ఛైర్మన్ దివంగత దేరంగుల వీరభద్రయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం మండల పరిధిలోని మాధవరం గ్రామం వడ్డెపల్లెలో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. వీరభద్రయ్య రాయచోటి పట్టణాభివృద్ధికి విశేష కృషి చేశారని మండిపల్లి కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సుదర్శన్ (పాతచిత్రం)

రాయచోటి : రాయచోటి-గాలివీడు మార్గంలోని ముసల్‌రెడ్డిగారిపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గాలివీడు నుంచి రాయచోటికి వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు వైపు వెళ్తున్న ట్రాక్టరును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ట్రాక్టరు డ్రైవరు కుర్రపోతుల సుదర్శన్(44) తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. కె.లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డారు. వర్షం కోసం పూజలు చేసి ఇసురు రాళ్లను గ్రామ పొలిమేర్లు దాటించేందుకు ట్రాక్టరులో తరలించే సమయంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మాధవరం గ్రామం చెంచర్లపల్లెకు చెందిన సుదర్శన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. స్కూల్ వ్యాను డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న సుదర్శన్ మృతితో ఆయన కుటుంబంలో విషాదం అలుముకుంది.

రాయితీపై ఉలవల పంపిణీ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీఏఏ పరిమళ పేర్కొన్నారు. మండల పరిధిలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవనాథరెడ్డి, యాగంటి పాపయ్య, సిద్దక నాగిరెడ్డి పాల్గొన్నారు.


రైతులకు ఉలవలు అందజేస్తున్న చేస్తున్న తెదేపా నాయకులు

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయండి

రాజంపేట, న్యూస్‌టుడే : అన్నమయ్య జలాశయం మట్టి కట్ట కొట్టుకుపోయిన కాంక్రీటు కట్ట నిర్మాణ పనులను రద్దు చేయవద్దని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆకేపాడు భవన్‌లో ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 25శాతం మించి జరగని పనులను రద్దు చేయాలని నిర్ణయించడంలో భాగంగా టెండర్లు పూర్తయిన అన్నమయ్య జలాశయ కాంక్రీటు కట్ట పనులను రద్దు చేయవద్దని కోరారు. అన్నమయ్య జలాశయ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని గాలేరు నగిరి పనులు కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కరాటే రాష్ట్ర జట్ల ఎంపిక

రాజంపేట, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 1న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.రమణరాజు తెలిపారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ కరాటే పోటీలో పాల్గొంటారని వివరించారు.

బాలుర జట్టు : బి.సన్యాసిరావు(కృష్ణా), కె.బద్రినాథ్, డి.అరవింద్(కర్నూలు), ఎస్.రవికుమార్, ఎ.భాస్కర్‌రావు, కె.మేధోసాయి అశీష్, ఎస్.కె.నవాజ్ అహమ్మద్, కె.ప్రణీత్, ఎస్.జగన్, ఎం.ప్రణీత్ (విశాఖ), పి.సాయివెంకటశివ, పి.నాగూర్‌వల్లి (చిత్తూరు), వై.వెంకటచలపతి (కడప)లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: తనూజ (నెల్లూరు), ఇ.రేవతి, సుగందిని (కర్నూలు), జి.జయసౌద(వెస్ట్ గోదావరి), ఎన్.సంయుక్త, ఎ.యశశ్వని(పశ్చిమగోదావరి), కె.రేణుక, పి.కీర్తి (విశాఖ), ఎం.నిఖిత, పి.సిరి(అనంతపురం), పి.రాజరాజేశ్వరి(కృష్ణా) ఎంపికయ్యారు.



కరాటే పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టు



బాలికలతో రాష్ట్ర జట్టు నిర్వాహకులు

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : హరితరాయబారులకు 15వ ఆర్థిక సంఘం నిధులతో జీతాలివ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న తమ జీతాలను చెల్లించాలని కోరిన హరితరాయబారులపై అధికారులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హరితరాయబారులు, సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

గాలివీడు, న్యూస్‌టుడే: తూముకుంట పంచాయతీ ప్రకాశ్‌నగర్‌కాలనీలో వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి భాస్కర్ పేర్కొన్నారు. ‘ఈనాడు’లో గురువారం వింత వ్యాధితో ఆవుల మృత్యువాత అనే వార్త ప్రచురితమైంది. అందుకు స్పందించిన పశువైద్యులు వ్యాధిన బారిన పడిన పశువులకు టీకాలు వేశారు. కాలనీలో ఉన్న పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

చెత్త పన్నుకు చెల్లు చీటీ..!

వసూళ్లను నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఎన్నికల హామీ అమలుతో పట్టణవాసులకు ఊరట

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రాంతాల్లో అమలులో ఉన్న చెత్తపన్ను వసూళ్లను నిలిపివేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 2 నుంచి చెత్త పన్నును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా సర్కారు హయాంలో చెత్త పన్ను వసూళ్లను తీసుకొచ్చారు. దీనిపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. చెత్త పన్ను చెల్లించని ఇంటి యజమానులకు కొన్ని ప్రాంతాల్లో పింఛను సొమ్ము నుంచి రాబట్టేందుకు ప్రయత్నాలు చేయడం గమనార్హం.

● వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2021 అక్టోబరు నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరిట పట్టణాల్లో ప్రజలు, వ్యాపారుల నుంచి చెత్త తరలింపునకు నగదు వసూళ్లకు శ్రీకారం చుట్టింది. దీని కోసం వాహనాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. ప్రతి వాహనానికి నెలకు రూ.వేలల్లో అద్దె చెల్లించే ప్రాతిపదికన నిర్ణయించారు. ఈ భారం పురపాలక సంఘాలపై పడకుండా ఉండేలా గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల నుంచి ప్రతి నెలా పన్ను వసూలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రూ.30 నుంచి రూ.2 వేల వరకు భారం మోపేలా చర్యలు చేపట్టారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ కోసం మూడు రంగుల డబ్బాలు సైతం అందజేశారు.



రాయచోటి పురపాలక పరిధిలోని చెత్త సేకరణ వాహనం

రాయచోటి పురపాలికలో ఇలా...

జిల్లా కేంద్రమైన రాయచోటి పురపాలక పరిధిలో 34 వార్డుల్లో సుమారు 31 వేల నివాసాలున్నాయి. రోజుకు 48 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. చెత్త సేకరణకు 24 వాహనాలున్నాయి. ఒక్కో వాహనానికి కొన్ని నెలలపాటు వేల రూపాయలు అద్దె చెల్లించారు. అనంతరం ట్రిప్పుల ప్రకారం వాహనాలకు అద్దె చెల్లించారు. మొత్తం మీద ప్రస్తుతం 24 వాహనాలకు రూ. 9 లక్షల వరకు అద్దె చెల్లించారు. చెత్త సేకరణకు పురపాలక పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.76 లక్షలు ఖర్చు చేసి లక్ష పది వేల బుట్టలను కొనుగోలు చేశారు. వీటిలో 80 వేల చెత్త బుట్టలు ప్రజలకు పంపిణీ చేశారు. మిగిలిన 30 వేల బుట్టలు నిరుపయోగంగా ఉన్నాయి. పురపాలక పరిధిలో ప్రతి ఇంటి నుంచి రూ.60 చెత్త పన్నును చేశారు. రాయచోటి పురపాలక పరిధిలో 2022లో వసూలైన మొత్తం చెత్తపన్ను.రూ. 86,27,738, 2023లో రూ.94,88,380, 2024లో మే నెల వరకు రూ.3,80,860 వసూలు చేశారు.

● ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురపాలక సంఘాల్లో వసూలు చేస్తున్న చెత్త పన్నును నిలుపుదల చేయడం హర్షనీయమని పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యతిరేకత ఉన్నా గత వైకాపా సర్కారు పట్టించుకోకపోవడం, ఎన్నికల సమయంలో నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించినా అది తాత్కాలికమేనని ఓటర్లు భావించి గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని ప్రజలు చర్చించుకుంటున్నారు.